క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



నడికూడ : తహసీల్దార్‌గా జి.రవీందర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన గుండాల నాగరాజు కలెక్టరేట్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే. తహసీల్దార్ రవీందర్‌రెడ్డికి రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. బదిలీపై వెళ్తున్న నాగరాజును శాలువాతో సన్మానించి వీడ్కోలు పలికారు.

ఆత్మహత్యకు ప్రేరేపించిన ఐదుగురిపై కేసు

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన కోగిల ప్రమీలకు మంత్రాలు వస్తాయని అవమానించి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన కోగిల ప్రమీల కూలి చేసుకుంటూ తన జీవనాన్ని కొనసాగిస్తుంది. ప్రతిరోజు మాదిరిగా బుధవారం ఉదయం 6గంటలకు కూలికి వెళ్లింది. ఈ క్రమంలో అక్కడ పని చేస్తున్న వాళ్లతో కలిసి పని చేసేందుకు ప్రమీల ప్రయత్నించగా కోగిల అహల్య, ఆమె భర్త మొగిలి, కోగిల జయ, మంద అయిలయ్య, మంద కొమురమ్మ అవహేళనగా ప్రవర్తించినట్లు తెలిపారు. 'నువ్వు మాతో కలిసి పని చేయకూడదు, నీకు మంత్రాలు వస్తాయని'అంటూ అవమానించడంతో పాటు కోగిల అహల్య, ఆమె భర్త మొగిలి ప్రమీలను దూషిస్తూ చెప్పుతో దాడి చేసేందుకు ప్రయత్నించారు. దీంతో మనస్తాపం చెందిన ప్రమీల ఇంటికి తిరిగి వచ్చి ఇంట్లో ఎవరులేని సమయంలో పురుగుల మందు సేవించింది. దీంతో ప్రమీలను చికిత్స నిమిత్తం పరకాలోని సివిల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న బాధితురాలి కుమారుడు కోగిల చంద్రమౌళి ఫిర్యాదు మేరకు తన తల్లి ప్రమీలను అవమానించి ఆత్మహత్యకు పేరేపించిన కోగిల అహల్య, ఆమె భర్త మొగిలి, కోగిల జయ, మంద అయిలయ్య, మంద కొమురమ్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పరమేశ్ తెలిపారు.

అమృత్ మిత్ర 2.0 ప్రారంభం

నర్సంపేట: పట్టణంలోని కుమ్మరికుంట చెరువు వద్ద అమృత్ మిత్ర 2.0 కార్యక్రమాన్ని బుధవారం మునిసిపల్ కమిషనర్ భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కుమ్మరికుంట చెరువును సందర్శించి చెరువు దగ్గరలో ఉన్న ధరణి, సృష్టి స్లం సమాఖ్యల ఎదుట సంఘాల మహిళలతో చెట్లు నాటించడానికి కమిషనర్ అమృత్ మిత్ర 2.0 కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఏఈ రాజేష్, మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, మెప్మా డీఎంసీ జి.రేణుక, ఏడీఎంసీ ఎస్‌కె.వహీద, టీఎల్ఎఫ్ ఆర్‌పి ఆర్.మాధవి, సీఎల్ఆర్‌పి డి.సుమలత, సంఘాల మహిళలు పాల్గొన్నారు.

తాటిచెట్లను తొలగించిన వారిపై చర్య తీసుకోవాలి

వర్ధన్నపేట : అక్రమంగా తాటిచెట్లను నరికి పడవేసిన వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ఇల్లంద గ్రామ గౌడ కులస్తులు బుధవారం వర్ధన్నపేట ఎక్సైజ్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు గౌడ పెద్దలు తెలిపారు. ఇల్లంద గ్రామశివారు రామోజీ కుమ్మరిగూడెం రోడ్డు పక్కనున్న చెలకల గట్లపై పెరిగిన తాటివనంలో 8 చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా గౌడ కులస్తులను ఆర్థికంగా దెబ్బ తీయడానికి రాత్రికి రాత్రి ఎవరూ లేని సమయంలో చెట్లను నరికి వేశారు. వ్యక్తులను గుర్తించి చట్టపరంగా శిక్షించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో గౌడ పెద్దలు సమ్మెట సూరి, సట్ల సూరి, కత్తి వేణు, ఉన్నారు.

రాజుకు దళితరత్న అవార్డు

వర్ధన్నపేట : మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన జన్ను రాజుకు దళితరత్న అవార్డు అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ ఉత్సవ కమిటీ, శాతవాహన యూనివర్సిటీ పూర్వ విద్యార్థిగా తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. దళిత సమాజాన్ని విద్యావంతులుగా మార్చే దిశలో భాగంగా సేవా భావంతో అనేక కార్యక్రమాలు చేస్తున్నందుకు 134వ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన దళితరత్న అవార్డు అందుకోవడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ అవార్డును అందచేసిన తెలంగాణ రాష్ట్ర ఉత్సవ కమిటీ చైర్మన్ ఇటుక రాజు, రాష్ట్ర మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు జన్ను కనకరాజు, దళిత సంఘాల నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పిడుగు పాటుకు గేదె మృతి

నెక్కొండ : పిడుగు పాటుకు పాడి గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని అమీన్‌పేటలో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. బాధిత రైతు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిలుపూరి సారమ్మ ఉదయం పాడి గేదెను మేతకు తీసుకెళ్లింది. గ్రామ శివారులో గేదె మేత మేస్తుండగా ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తోంది. ఈ క్రమంలో పిడుగు పడడంతో గేదె మృతి చెందింది.

మలుపులు.. మృత్యు పిలుపులు

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- ఎప్పుడేం జరుగుతుందోనని భయాందోళన
- కానరాని సూచిక బోర్డులు



పీచర నుంచి హనుమకొండ వెళ్లే ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఉన్న మలుపులు



శాలపల్లి నుంచి వేలేరుకు వెళ్లే దారిలో..



మల్యాపూర్‌కు వెళ్లే దారిలో..

వేలేరు : ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తులు క్షేమంగా తిరిగి వస్తారనే నమ్మకం ప్రస్తుతం మండల ప్రజలకు లేకుండా పోయింది. ఏదో ఒకచోట రోడ్డు ప్రమాదాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారుల మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక గతంలో ప్రమాదాలు జరిగిన ఘటనలు అనేకంగా ఉన్నాయి. మండలంలోని 14 గ్రామపంచాయతీలకు వెళ్లే రోడ్లపై మలుపులు ప్రమాదకరంగా ఉండటంతో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొందని పలువురు ఆందోళన చెందుతున్నారు.

కానరాని సూచిక బోర్డులు..

రోడ్డు నిర్మాణం చేపట్టినప్పుడే సంబంధిత కాంట్రాక్టర్ రోడ్డుపై మలుపులు ఉన్న చోట సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తారు. మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్లు మొత్తం సింగిల్ రోడ్లే కావడం, మలుపుల వద్ద చెట్లు ఏపుగా పెరుగడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. దీనికి తోడు మరికొన్ని చోట్ల మూల మలుపులు ఉన్న ప్రాతంలో రోడ్లకు అనుకుని వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్డు వెంట ప్రయాణించేటప్పుడు వాహనాలు జాగ్రత్తగా నడిపతే ప్రమాదం సంభవించి ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది. మలుపుల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, వ్యవసాయ బావులకు రక్షణ గోడలు లేకపోవడంతో ఇటీవల వాహనదారులు ప్రమాదాల బారిన పడిన ఘటనలు అనేకంగా ఉన్నాయి. అధికారులు స్పందించి మలుపులు వద్ద చెట్లను తొలగించి, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కొరుతున్నారు.

బ్యాంకు ఏర్పాటుకు చర్యలు



దామెరలో పర్యటించిన బ్యాంకు అధికారులు

దామెర : మండల కేంద్రంలో బ్యాంకు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు బుధవారం మండలంలో బ్యాంకు అధికారులు పర్యటించి వివరాలు సేకరించారు. కాగా దామెరలో బ్యాంకు ఏర్పాటు చేయాలని కొద్ది రోజులుగా బీజేపీ నాయకులు విజయ్‌చందర్‌రెడ్డి, శ్రీరాంరెడ్డి, వేల్పుల రాజ్‌కుమార్, బత్తుల సమంత్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యతో పాటు బ్యాంకు అధికారులకు కలిశారు. దీంతో మంగళవారం బ్యాంకు అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ ప్రావీణ్య దామెరలో బ్యాంకు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలో బ్యాంకు అధికారులు పర్యటించి గ్రామాల వివరాలు, విస్తీర్ణం, బ్యాంకింగ్ లేమితో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలను అడిగి తెలుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నివేధిక తయారుచేసి ఉన్నతాధికారులకు సమర్పించి బ్యాంకు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. పర్యటించిన వారిలో బ్యాంకు మేనేజర్ వెంకటాచారి, జనరల్ మేనేజర్ మహేందర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాంరెడ్డి, మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఉన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలకు తరలిరావాలి



కళా ప్రదర్శనలిస్తున్న జీపుజాతా కళాకారులు

కమలాపూర్ : ఈనెల 26, 27వ తేదీల్లో హసన్‌పర్తిలోని శుభమస్తు ఫంక్షన్‌హాల్‌లో జరిగే సీపీఐ జిల్లా రెండో మహాసభలకు తరలిరావాలని సీపీఐ మండల కార్యదర్శి నకీర్త ఓదెలు పిలుపునిచ్చారు. జిల్లా మహాసభల విజయవంతం కోసం చేపట్టిన జీపు జాత బుధవారం కమలాపూర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా జీపు జాత కళాకారులు నిర్వహించిన కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఓదెలు మాట్లాడుతూ.. నిరుపేదలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సీపీఐ అనేక పోరాటాలు చేసిందని, సీపీఐ ఆవిర్భావమై వందేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని హనుమకొండ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామని, ఈ మహాసభలకు జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన సీపీఐ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజుగౌడ్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి ఒల్లె మహేందర్, రవీందర్, రవన్న, జీపు జాత కళాకారులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



కమలాపూర్ : ఇరుముడులతో బయలుదేరుతున్న హనుమాన్ మాలధారులు



ఆత్మకూరు : సన్మానిస్తున్న మాలధారులు

కమలాపూర్ : మండలంలోని శంభునిపల్లిలో బుధవారం సాయంత్రం హనుమాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దాత గోనె చంద్రశేఖర్ బహూకరించిన రూ.50 వేల విలువచేసే హనుమాన్ ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గ్రామ ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. అంతకు ముందు హనుమాన్ మాలధారుల ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని పలువురు హనుమాన్ మాలధారులు ఇరుముడులు కట్టుకుని మాలా విరమణ కోసం కొండగట్టు, భద్రాచలం తదితర పుణ్యక్షేత్రాలకు తరలివెళ్లారు. హనుమాన్ మాలధారులు బొల్లం రాజిరెడ్డి, బాబు, కిషన్‌రెడ్డి, విద్యాసాగర్, పాల్గొన్నారు.

సన్మానం

ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్లలో 101 రోజుల హనుమాన్ దీక్ష పూర్తిచేసుకున్న బలవంతుల రాజును బుధవారం హనుమాన్ మాలధారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అల్లం నర్సింగం, చందు, బలవంతుల శ్రీకాంత్, రాజ్‌కుమార్, రాజు, నిఖిల్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

వేలేరు : తనతో పాటు పదో తరగతి వరకు కలిసి చదువుకుని ఆర్థిక ఇబ్బందులతో ఇటీవలే ఆత్మహత్యకు పాల్పడిన స్నేహితుడి కుటుంబానికి 2007–2008 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. మల్లికుదుర్ల గ్రామానికి చెందిన గుజ్జుల సంపత్‌రెడ్డి కొన్ని రోజుల క్రితం ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు తలోకొంత జమ చేసి రూ.10 వేలు బాధిత కుటుంబ సభ్యులకు అందించారు.

బాలబాలికల పరిరక్షణకు కృషిచేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ స్వాతి

ఆత్మకూరు : బాలబాలికల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని మండల వైద్యాధికారిణి స్వాతి అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వోదయ సంస్థ ఆధ్వర్యంలో మహిళల, బాలల సంక్షేమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలబాలికలకు తమ హక్కులను తెలియచేయాలన్నారు. తమ హక్కుల పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు. అనంతరం బాలల పరిరక్షణ అధికారి ప్రవీణ్ మాట్లాడుతూ.. బాలలను స్వేచ్ఛగా జీవించేలా తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో సఖి సెంటర్ అడ్మిన్ హైమావతి, సర్వోదయ ట్రెనింగ్ కోఆర్డినేటర్ ఇందిర, శ్రీదేవి, భారతి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సింహ గర్జన ర్యాలీని జయప్రదం చేయాలి

- మెపా రాష్ట్ర కార్యదర్శి తాళ్ల రవి

శాయంపేట : ఈనెల 25వ తేదీన ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో నిర్వహించతలపెట్టిన ముదిరాజ్ సింహ గర్జన చైతన్య ర్యాలీని, సభను జయప్రదం చేయాలని ముదిరాజ్ ఎంప్లాయ్ అండ్ ప్రొఫెషనల్ (మెపా) రాష్ట్ర కార్యదర్శి తాళ్ల రవి ముదిరాజ్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌ల హక్కులను సాధించుకునేందుకు, రాజకీయ పార్టీలకు తమ బలాన్ని చూపించేందుకు ముదిరాజ్ సింహ గర్జన చైతన్య ర్యాలీని, సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముదిరాజ్‌లంతా ఏకధాటిపై వచ్చి విద్య, ఉద్యోగం, సాధికారత లక్ష్యంగా ఉద్యమించాలని కోరారు. ప్రభుత్వాలు ముదిరాజ్‌లకు ప్రాధాన్యం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని, ముదిరాజ్‌లను బీసీ–ఏలో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. సింహ గర్జన ర్యాలీ, సభకు ముదిరాజ్‌లు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

పరకాల : ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలో ఈనెల 25వ తేదీన నిర్వహించతలపెట్టిన ముదిరాజ్ సింహగర్జనను జయప్రదం చేయాలని మెపా రాష్ట్ర కార్యదర్శి తాళ్ల రవి బుధవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ముదిరాజ్‌లను బీసీ–ఏలో చేర్చడంతో పాటు 75 శాతం సబ్సిడీతో సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌లకు అవకాశం కల్పించి న్యాయం చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివి



ఎల్కతుర్తి : నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



శాయంపేటలో..



ఆత్మకూరులో..

ఎల్కతుర్తి : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరు, ఎల్కతుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు చిట్టంపల్లి అయిలయ్య, ఇంద్రసేనారెడ్డి రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ ప్రధానిగా దేశ ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంతాజీ, రాజేశ్వర్‌రావు, జోగిరెడ్డి, రమణారెడ్డి, అనీల్‌కుమార్, వెంకటేశ్, బాబురావు, మహేందర్, బక్కి, ప్రకాశ్, చంద్రశేఖర్‌గుప్తా, రవీందర్, రాజు, అనీల్‌యాదవ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. భారతదేశంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ఆయన ప్రధానిగా దేశాన్ని ఆర్థికపథంలో నడిపారని, సరికొత్త సంస్కరణలతో అభివృద్ధిలో వేగం పెంచారని తెలిపారు. నాయకులు కుమారస్వామి, కట్టయ్య, వరదరాజు, మార్కండేయ, రంగుబాబు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలో కాంగ్రెస్ నేత, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పంట మార్పిడితో నేలసారం పెంపుదల



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఉమారెడ్డి

ఎల్కతుర్తి : పంట మార్పిడితో నేలసారం పెరుగుతుందని వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఉమారెడ్డి అన్నారు. బుధవారం భీమదేవరపల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం ఏఓ ఎల్.పద్మ ఆధ్వర్యంలో జరిగింది. ఆయన హాజరై మాట్లాడారు. రైతులు సాగు చేసే పంటల్లో యూరియాను అధికంగా వినియోగించకుండా సిఫారసు మేరకు వాడాలన్నారు. పంట మార్పిడి విధానం ద్వారా నేలసారాన్ని సహజ సిద్ధంగా పెంచుకునేందుకు పప్పు ధాన్యాలు, నూనె గింజలు పంటను సాగు చేయాలని సూచించారు. నీటిని తక్కువ వినియోగించుకునే చిరు ధాన్యాల పంటలు సాగు చేసుకోవాలన్నారు. ఎకరం వరిసాగుతో పాటు జొన్న, వేరుశనగ, ఇతర పంటలు సాగు చేసుకోవాలన్నారు. అనంతరం ఏఓ పద్మ మాట్లాడారు. తొలకరి వర్షాలకు జీలుగ, జనుము, పెసర పంటల సాగుకు వరినాట్లకు ముందు వేసుకోవాలని, 45రోజుల తర్వాత భూమిలో కలియదున్నడంతో భూసారం పెరుగుతుందన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



డబ్బులు అందజేస్తున్న గ్రామస్తులు

వేలేరు : సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చని ఎస్సై అజ్మీర సురేశ్ అన్నారు. మండలంలోని మల్లికుదుర్ల గ్రామంలో బుధవారం సీసీ కెమెరాల ఏర్పాటుపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కొంతమంది సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చి 16 కెమెరాలకు సరిపడా డబ్బులు అందించారు. మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, మాజీ ఉపసర్పంచ్ సురేశ్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు పాల్గొన్నారు.

కాళేశ్వరంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్ర

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ కుట్రలను ఛేదిస్తూ అనుభవజ్ఞులైన నిపుణులచే రూపొందించిన సమగ్ర నివేదికను బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజలు, రైతాంగం ముందు ఉంచుతుందన్నారు. మేధావులు, విద్యావంతులు, బుద్ధిజీవులు, ప్రజలు, రైతులు, యువత ఈ నివేదికను చదివి వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోవాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక్క ఫిల్లర్ డామేజ్ జరిగితే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారం రాష్ట్ర ప్రజలందరికి తెలుసని అన్నారు. ఇటీవల జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వచ్చిన ఆదరణను చూసి ఓర్వలేక ఇలాంటి కుట్రకు ఒడిగడుతున్నారని అన్నారు.

సమ్మిరెడ్డికి నివాళి



ఐనవోలు : మండల కేంద్రానికి చెందిన ఐనవోలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) మాజీ చైర్మన్ బొమ్మినేని సమ్మిరెడ్డి (70) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు బుధవారం మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా సమ్మిరెడ్డి 1998 నుంచి 2004 వరకు ఐనవోలు పీఏసీఎస్ చైర్మన్‌గా సేవలందించారు. 2004 అనంతరం ఐనవోలు పీఏసీఎస్‌ను వర్ధన్నపేటలో విలీనం చేశారు.

ఐదు రోజులుగా రాని మంచినీరు



బిందెలతో నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

పర్వతగిరి : మండల కేంద్రంలోని కొత్తవాడ కాలనీలో ఐదు రోజులుగా మంచినీటి రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో తాగునీటికి నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరు నెలల క్రితం కాలనీలో పాత మంచినీటి పైపులైన్ మరమ్మతుకు రాగా గ్రామపంచాయతీ సిబ్బంది మరమ్మతు చేయకుండా వదిలేశారు. గ్రామంలోని అన్ని చోట్ల పాత పైపులైన్ నుంచి మంచినీటి సరఫరా అవుతున్నా మా కాలనీ కనీసం పాత పైపులైన్ రిపేరు చేస్తే మంచినీటి సరఫరా అయ్యేదని కాలనీవాసులు మంతుర్తి దిలీప్, మంతుర్తి విజయ, తుంగ ఎల్లయ్య, నూనె యాదగిరి, నూనె మల్లేషం, నూనె అనసూయ, నూనె రజిత, నూనె మని, ఎం.శ్రీశైలం, చెవ్వ పద్మ, జంగ శ్రీలత, నూనె రమాదేవి, బైరబోయిన రామ తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ కార్యదర్శి, సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా సమాధానం చెపుతున్నారని కాలనీవాసులు ఆరోపించారు. ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తామన్న నీఇష్టం ఉన్న చోట చెప్పుకో అని పంచాయతీ కార్యదర్శి పొంతనలేని సమాధానం చెబుతున్నాడని మండిపడ్డారు.

విత్తనాలు డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలి



నర్సంపేట రూరల్ : రైతులు విత్తనాలను అధీకృత డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలని నర్సంపేట వ్యవసాయ సహాయ సంచాలకుడు దామోదర్‌రెడ్డి అన్నారు. సీడ్ టాస్క్‌ఫోర్స్ బృందం ఆధ్వర్యంలో పట్టణంలోని విత్తన షాపులను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ సీడ్ ప్యాకెట్స్‌పై అన్ని వివరాలు సరిగా ఉన్నాయో లేదో చూసుకోవాలని రైతులకు సూచించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాల బిల్లులను పంట పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలన్నారు. ఆయన వెంట ఎస్సై రవికుమార్, ఏఓ కృష్ణకుమార్, గోపాల్‌రెడ్డిలు ఉన్నారు.